# పెద్ద (చిన్న) మనసు

— శశి, New Jersey

వరండాలో మంచంమ్మీద నడుం వాల్చారు వరలక్ష్మిగారు విసురుకుంటూ. ఏమిటో జూలై నెలలో కూడా వేడిగానే అనిపిస్తుంది, అనుకుంటుంటే నవ్వువచ్చింది. మనిషి ఎంత తొందరగా సుఖానికి అలవాటు పడతాడు అని.

అమెరికానుండి వచ్చి నెల రోజులయింది. అక్కడ వున్నది ఎనిమిది నెలలే అయినా ఈ వేడి వాతావరణం తట్టుకోలేనట్లు అనిపిస్తుంది. తనకే యింత కష్టంగా వుంటే, పాపం అక్కడే పుట్టి పెరిగిన మనుమరాలు, మనుమడు ఎలా తట్టుకునేవాళ్ళో. కాని ఎప్పుడూ ఒక్క కంప్లెయింటు చేయలేదు.

రెండు సంవత్సరాల క్రితం పిల్లలిద్దరూ—మీర, హరి వచ్చి తన దగ్గర మూడునెలలు వున్నారు. We want to spend time with నానమ్మ, and our cousins అంటూ. వున్నన్ని రోజులు వాళ్ళు ఆనందంగా వుండటమే కాక అందరికి ఆనందం పంచియిచ్చారు. యాసతోనైనా చక్కటి తెలుగు మాట్లాడేవాళ్ళు. కళ్ళమ్మట, ముక్కమ్మట నీళ్ళు కారుతున్నా it is OK నానమ్మ అంటూ ఆవకాయ, కూరలతో అన్నం తినేవాళ్ళు. అమ్మ, నాన్న లేకుండా వాళ్ళు ఇద్దరే వస్తున్నారు అన్నప్పుడు ఎంత ఆందోళన చెందిందో. తీరా వాళ్ళు వెళ్ళిపోతున్నప్పుడు అంత బాధగాను అనిపించింది. అందుకే అబ్బాయి ప్రభాకరం రమ్మన్నప్పుడు వెంటనే సరే అంది. కాని తను వెళ్ళిన తరువాత వాళ్ళు అంత ప్రశాంతంగాను, నిశ్చింతంగా వున్నారా?

యిప్పుడు ఆత్మావలోకనం చేసుకుంటుంటే అనిపిస్తుంది ఎప్పుడూ యిండియాలో అమెరికాని పోల్చి విమర్శ చేస్తుంటే వాళ్ళ ముఖాలు చిన్నబోయేవి. వారానికి ఒకసారి మీరెలా వున్నారు, మీ పిల్లలెలా వున్నారు అని ఫోనులు చేసే కోడలు సుజాత ఫ్రెండ్స్‌ను చూచి ఏమిటో యిండియాలో అయితే ఆ గుమ్మంనుండి పలుకరించి వెళ్ళేవాళ్ళు వెళ్తే ఈగుమ్మంనుండి పలకరించటానికి యింకోళ్ళు. ఇక్కడ మనుషులకు ముఖంవాచి పోతున్నాము అనేది. అక్కడకూ ప్రతివారం పార్టీలకన్నా చూడవలసిన ప్రదేశాలకి వున్నన్ని రోజులు time అడ్జస్టు చేసుకుంటూ తిప్పనే తిప్పారు. టూర్లుకు వెళ్ళినప్పుడు కూడా వాళ్ళకు యాతనగానే వుండేది. ఆ పీట్జాలు, ఫ్రెంచి ఫ్రైలు అవీ వుప్పూ, కారం లేకుండా చప్పగా వున్నాయని తను తినేది కాదు. తన గురించి ప్రత్యేకంగా యింటి నుండి ఏదో ఒకటి పేక్ చేసి తెచ్చేవాళ్ళు. యావినింగు మీరు ఖాళీయేనా 6'o clock వస్తాము ఏమయినా క్యాసెట్లు వుంటే యిద్దురుగానిఅని కోడలు call చేసి వెళ్తే యిదేం విడ్డూరం phone చేసి time చెప్పుకుని ఆ time ప్రకారం వెళ్ళాలా? ఫ్రెండ్సన్న తరువాత job నుండి వస్తూ అలా కార్లో వెళ్ళి రావచ్చు కదా అనుకునేది. కాని యిప్పుడు, అక్కడికి వెళ్ళి వచ్చిందని తనను పలుకరించటానికి (చెప్పా చెయ్యకుండా) వచ్చే జనాలతో తనకంటూ ఒక్క అరగంట లేక విసుగ్గా వుంది. ఏవి సర్దాలన్నా, చేయాలన్నా call చేసి వస్తే బావుణ్ణు, ఈ పని మొదలు పెట్టక పోయేదాన్ని అనిపిస్తుంది మధ్యలో ఆగిపోయిన పనులు చూచి.

'ఏమ్మా! T.V. చూస్తలేరా? మంచి సినిమా వస్తుంది' అంటూ వచ్చింది మంగ. 'ఏమోనే చూడబుద్ధి కావటం లేదు.' అంటూ పక్కకి వత్తిగిలారు. అవును చూస్తే మటుకు ఏం బుఱ్ఱకి ఎక్కి చస్తుంది కనుక. సినిమా అనగానే పది పదిహేను మంది చేరుతారు చుట్టుప్రక్కల వాళ్ళు పిల్లలతో సహా. అక్కడే అన్ని కబుర్లు, పరామర్శలూను. డైలాగు ఒకటి వినిపిస్తే ఒకటి వినిపించదు. లివింగు రూములో quietగా కూచుని చూడ్డానికి అలవాటు పడ్డ తరువాత, యిక్కడ ఎంతమంచి సినిమా కాని చూడబుద్ధి కావటం లేదు. అక్కడ వున్నప్పుడు అది మటుకు మనస్ఫూర్తిగా ఆనందించిందా అదీ కాదు. పాతిక, యిరవై మైళ్ళ దూరంలో వున్న storesకి వెళ్ళి ఫ్రెండ్సును అడిగి తీసుకువచ్చేవాళ్ళా సినిమాలను. వాళ్ళయితే ఫాస్టు ఫార్వార్డులో చూస్తారుట అదే మీట్రా అంటే time లేక ఫైటింగులు, పాటలు ఫార్వర్డు చేసి రెండు మూడు రోజులకు ఒక సినిమా చూస్తారుట. Work నుండి వచ్చిన తరువాత కూడా తనను ఒంటరిగా వదలలేక అలసిపోయి వచ్చి, కళ్ళు వాలిపోతున్నాఆ తనకు తోడుగా కూర్చునే వాళ్ళు. అంతా చూసిన తరువాత ఏంబాగుంది చెత్త సినిమా యిలాంటివి తెస్తారెందుకు అనేది. వాళ్ళ ముఖాలు చిన్నబోయేవి. మనసులో ఏదీ వుంచుకోదు కనుక సుజాత అక్కడికీ ఒకసారి అంది, 'మాకు మాత్రం ఎలా తెలుస్తుంది అత్తయ్యా మేము అక్కడ చూసి తీసుకురాము కదా కొత్తగా ఏవి వచ్చాయి అంటే అవి తీసుకు వస్తున్నాము.' అని. అయినా వాళ్ళను అని ఏం లాభం, యిక్కడ గొడవలో బుఱ్ఱకు ఎక్కక సరిగ్గా తెలిసేది కాదు కాని ఏదో ఒకటి అరా తప్ప యిప్పుడు వచ్చే సినిమాలే అలా తగలడుతున్నాయి. యిలాంటి చిన్న చిన్న వాదనలతో అక్కడ, యిక్కడ అని పోల్చుకుంటూ వున్నన్నాళ్ళు వాళ్ళను ప్రశాంతంగా వుండనీయక టెన్షన్ పెట్టేది.

చిన్న పిల్లలకు వున్నంత అండర్‌స్టాండింగు కూడా తనకు లేకపోయింది. వచ్చిన రెండు మూడు రోజుల్లోనే మీరు ఎలా వుంటే మేము అలా, మీరు ఏం తింటే మేము అది అని చక్కగా అడ్జస్టు అయిపోయారు (వరలక్ష్మిగారికి నవ్వు వచ్చింది. అమ్మా పగలస్తమానూ అలా కిటికీ దగ్గఱ కూర్చుంటే బోరుకొడుతుంది. మధ్యలో T.V. చూస్తుంటే అదే కొంచెం కొంచెం అలవాటు అవుతుంది అంటే అబ్బా ఆ భాష వింటేనే నాకు ఒళ్ళు మంట అది. యిప్పుడు వచ్చిన నాలుగు రోజులకే తనకూ ఆ మాటలు వచ్చేస్తున్నాయి.) పాపం మేలో వాళ్ళు వచ్చే సరికి యిక్కడ పిల్లలందరికి schools open అయిపోయాయి. మరి వాళ్ళకు జూను నుండి సెప్టెంబరు వరకూ శెలవలు. పగలస్తమానూ యిద్దరే వుండే వాళ్ళు యింట్లో. అయినా ఎప్పుడూ బోరు కొట్టింది అనలేదు. ఏదో పజిల్సు చేసుకుంటూనో, డ్రాయింగూ, కలరింగూ చేసుకుంటూ, కొద్దిసేపు తెలుగు నేర్చుకుంటారని తన దగ్గర కూర్చుని అలా ఏదో ఒకటి కల్పించుకుని టైము పాసు చేసేవాళ్ళు. అలా బోరుకొడుతుందనే తను, వాళ్ళు యింకా వుండకుండా మొండిగా వచ్చేసింది. యింకా నయం యిప్పుడయితే గొంతెత్తి పిలిస్తే పలికేంత దూరంలో వున్నారు మనవాళ్ళు. ప్రభాకరం వాళ్ళు వెళ్ళిన మొదట్లో అయితే 40, 50 మైళ్ళు ప్రయాణం చేసి వెళ్తే కాని ఒకరో ఇద్దరో ఫ్రెండ్సుని కలవటానికి వుండేది కాదుట. సంవత్సరానికి ఒకటి, రెండు తెలుగు సినిమాలు వచ్చేవట. యిప్పుడు ములక్కాడ, కరివేపాకు నుండి మల్లెలు, తమలపాకుల వరకూ అన్నీ అందుబాటులో వున్నాయి. మొదట్లో అయితే బీర, దొండ వంటి కూరలు దొరకయం గగనమట. అయినా అలాగే అడ్జస్టు అయి యింత వాళ్ళు అయారు ప్రభాకరం లాంటి వాళ్ళందరూ.

ఏమిటో ఇప్పుడు తలచుకుంటుంటే సిగ్గుగా వుంది. పైపై సౌఖ్యాల గురించి పిల్లల మనసు ఎంత కష్టపెట్టాను. మీరాకి, హరికి వుత్తరం వ్రాయాలి. మళ్ళా యీ శెలవులకి యిక్కడికి రమ్మని, అలా అయితే నేను మళ్ళా మీతో వచ్చి మీరు వుండమన్నన్ని రోజులు వుంటాను అని వుత్తరం వ్రాయడానికి వుపక్రమించారు వరలక్ష్మిగారు.